ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 వరంగల్

మంగళవారం 27 ఆగస్టు 2024



'వైద్యో నారాయణో హరి' అంటూ వైద్యుడిని దేవుడితో సమానంగా భావించే సంప్రదాయం మనది. ఆపదలో ఉన్నవారికి కళ్లెదుట కనిపించే ప్రాణదాతలు వైద్యులే. కాని నేడు అలాంటి వైద్యులకే రక్షణ లేకుండా పోతోంది. కోల్‌కత్తాలోని ఆర్‌జీకర్ మెడికల్ కాలేజీలో మహిళా జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య ఘటన దేశాన్ని కుదిపేస్తోంది. ప్రాణదాతల మానప్రాణాలకే భద్రత కరువైందనే ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో జూనియర్ డాక్టర్‌లు ఎదుర్కొంటున్న సమస్యలపై వరంగల్ నగరంలోని కాకతీయ మెడికల్ కాలేజీ, ఎంజీఎం అస్పత్రిని 'ఆంధ్రజ్యోతి' సందర్శించగా వారు అనేక విషయాలను వెల్లడించారు. ఆస్పత్రుల్లో కనీస సౌకర్యాలు కూడా లేకపోవటంతో ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 36 గంటల డ్యూటీతో ఒత్తిడి పెరిగినా తట్టుకుంటున్నామని, కానీ, అసౌకర్యాలతో మానసికంగా ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు.

మహిళ సెక్యూరిటీ గార్డును నియమించాలి

- డాక్టర్ లోహిత, పీజీ విద్యార్థిని, వరంగల్ కేఎంసీ



మెడికల్ కాలేజీల్లో చదివే విద్యార్థినుల వసతి గృహాల వద్ద పురుష సెక్యూరిటీ గార్డులను నియమిస్తున్నారు. రాత్రివేళ డ్యూటీ నుంచి రావాలన్నా.. ఎమెర్జెన్సీ కేసు వస్తే అస్పత్రికి పోవాలన్నా పురుష సెక్యూరిటీ గార్డులు ఉండటం ఇబ్బందికరంగా ఉంది. లేడీస్ హాస్టల్ వద్ద మహిళా గార్డులను నియమించాలి. రాత్రివేళ రోగులతో వచ్చే వారిని బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించి లోపలికి పంపించాలి.





ఆంధ్రజ్యోతి ఫోకస్

విధులకు భయం భయంగా..

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో జూనియర్ వైద్యుల అవస్థలు
- రోజుకు 36గంటల విధులతో పాట్లు
- చెప్పుకోలేని సమస్యల్లో జూనియర్ మహిళా డాక్టర్లు
- టాయిలెట్లు, రెస్ట్‌రూమ్‌లు కూడా లైని దైన్యం
- అర్ధరాత్రి ఆకతాయిల వేధింపులతో సతమతం
- పనిచేసే చోట సీసీ కెమెరాలు కరువు
- సౌకర్యాలు కల్పించాలని జూడాల డిమాండ్
- కోల్‌కత్తా ఘటనతో నగరంలోని ఆస్పత్రులపై 'ఆంధ్రజ్యోతి' ఫోకస్

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్


ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు మెడికల్ కాలేజీల్లో వైద్య విద్యార్థినుల బాధలు వర్ణనాతీతం. అసౌకర్యాల నడుమ విధులు నిర్వర్తిస్తున్నారు. కనీసం మూత్రశాలలు కూడం ఉండడం లేదు. విశ్రాంతి తీసుకునేందుకు రెస్ట్‌రూమ్ ఉండదు. అర్ధరాత్రి వేళ బయటకు వెళితే సీసీ కెమెరాలు, సెక్యూరిటీ లేనే లేదు. ఆస్పత్రుల్లో ఎంబీబీఎస్, పీజీ విద్యార్థులతో ఏకధాటిగా రెండు, మూడు రోజులు పనిచేయించటంతో వారిపై పనిభారం, మానసిక ఒత్తిడి ఎక్కువవుతోంది. అసౌకర్యాలు, అభద్రత మధ్య మహిళా జూడాలు భయం భయంగా విధులు నిర్వహిస్తున్నారు.

సౌకర్యాలెక్కడ?

ప్రభుత్వాస్పత్రుల్లో మహిళ జూనియర్ వైద్యుల బాధలు చెప్పలేకుండా ఉన్నాయి. విధులు చేసే ప్రదేశంలో కనీస సౌకర్యాలు లేకుండా పోయాయి. 36గంటలు డ్యూటీ చేసే జూనియర్ వైద్యులకు ప్రత్యేకంగా విశ్రాంతి గది అంటూ లేదు. కునుకు వస్తే డ్యూటీ టేబుల్‌పైనే నిద్రపోవాలి. కనీసం కాలకృత్యాలకు కూడా ప్రత్యేకంగా బాత్‌రూమ్‌లు లేవు. నర్సులకు కేటాయించిన రూమ్‌లలో అందరితో కలిసి వాడుకోవాలి. నర్సులు, వార్డుబాయ్‌లు, మగ డాక్టర్స్‌తో కలిసే నర్సుల రూమ్‌లోనే రెస్ట్ తీసుకోవాలి. మహిళలకు వచ్చే సమస్యలు వచ్చినా.. సెఫ్టీ రూమ్‌లు లేక అవస్థలు పడాల్సిందేనని ఓ లేడీ జూనియర్ డాక్టర్ వాపోయారు.

భద్రత కరువు

13 ఎకరాల్లో విస్తరించి ఉన్న వరంగల్ ఎంజీఎంలో కేవలం 10 సీసీ కెమెరాలే ఉన్నాయి. వీటిలో సగానికి పైగా పని చేయవు. ప్రతీరోజు 2,500-3,000 మంది రోగులు ఓపీకి వస్తుంటారు. రాత్రిపూట 70మంది వరకు మహిళా జూనియర్ డాక్టర్లు విధులు నిర్వహిస్తున్నారు. కానీ, ఎంజీఎంలో రాత్రిపూట 14మంది వరకే సెక్యూరిటీ సిబ్బంది డ్యూటీ చేస్తున్నారు. వీరిలో అందరూ మగ సెక్యూరిటీగార్డులే.. చాలావరకు మద్యం తాగి రాత్రి డ్యూటీకి వస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఏ మాత్రం రక్షణ లేకుండా వేలాది మంది రోగులకు తమ ప్రాణాలను ఫణంగా పెట్టి జూనియర్ మహిళ డాక్టర్లు వైద్య సేవలు అందించాల్సి వస్తోంది. ఇక రాత్రిపూట ఎంజీఎం నుంచి కేఎంసీలోని వసతి గృహానికి స్కూటీపై వెళ్లాలంటే కూడా భయపడుతున్నారు. కేఎంసీ ప్రధాన గేటు నుంచి హాస్టల్ వరకు చుట్టూ చెట్లే. కనీసం విద్యుత్ లైట్లు ఉండవు. గుంతలు పడిన రోడ్డు.. అర్ధరాత్రి పూట ఆస్పత్రిలో డ్యూటీ చేయ లేక.. హాస్టల్‌రూమ్‌కు వెళ్లలేక



మిగతా 7వ పేజీలో..

ఆధ్యాత్మిక, చారిత్రక సందర్శన కోసం..

- నేడు ఉమ్మడి వరంగల్ జిల్లాకు గవర్నర్ రాక
- నేటి నుంచి 29వ తేదీ వరకు పర్యటన
- రామప్ప, వేయిస్తంభాలు, పద్మాక్షమ్మ, భద్రకాళి ఆలయాల్లో పూజలు
- లక్నవరంతో పాటు వరంగల్ కోటను సందర్శించనున్న జిష్ణుదేవ్‌వర్మ
- రచయితలు, కళాకారులు, ఉన్నతాధికారులతో పరిచయ కార్యక్రమం
- విస్తృత ఏర్పాట్లు చేసిన ఆయా జిల్లాల కలెక్టర్లు



7

తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఈ నెల 27వ తేదీ నుంచి 29వ తేదీ వరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ఆలయాల దర్శనం, చారిత్రక కట్టడాల పరిశీలనకు రానున్నారు. తన పర్యట నలో యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయంతో పాటు చారిత్రాత్మక వేయిస్తంభాల గుడి, భద్రకాళి, పద్మాక్షమ్మ ఆలయాలను దర్శించుకోనున్నారు. లక్నవరం, వరంగల్ కోటను తన పర్యటనలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ సందర్శించనున్నారు. అలాగే వివిధ రంగాల్లో ప్రతిభను కనబరిచి అవార్డులు పొందిన వారితో పాటు ఆయా జిల్లాల ఉన్నతాధికారులు, కవులు, కళాకారులు, రచయితలతో గవర్నర్ భేటీ కానున్నారు. మూడు రోజుల పాటు సాగే గవర్నర్ పర్యటనకు ములుగు, హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాల అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

నేడు జిల్లా స్థాయి క్రీడా పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 26: ఈనెల 29 హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవం వేడుకల్లో భాగంగా మంగళవారం వరంగల్ జిల్లా క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఆహ్వాన క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు వరంగల్ డీవైఎస్‌వో సత్యవాణి ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదాదేవి ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా పరిధిలోని వివిధ మండలలకు చెందిన క్రీడాకారులకు కబడ్డీ, రెజ్లింగ్, జూడో, క్రికెట్ పోటీలను నిర్వహించనున్నట్లు ఆమె వెల్లడించారు.



మాడిపోయిన పత్తిచేనును చూపిస్తున్న రైతులు

నాసిరకం పురుగుల మందుతో దెబ్బతిన్న పంట

- 40 ఎకరాల్లో నష్టం వాటిల్లిందని పత్తి రైతుల ఆందోళన

పర్వతగిరి, ఆగస్టు 26: నాసిరకం పురుగులమందు పిచికారీ చేయడంతో పత్తిచేను మాడిపోయిందని, కాయలు, మొగ్గలు, ఆకులు మొత్తం రాలిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. బాధిత రైతులు సోమవారం తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని పెద్ద తండా గ్రామానికి చెందిన 15 మంది రైతులు సాగుచేసిన పత్తిచేలలో పిచికారీ చేయడానికి తండాలోనే ఉన్న యాకూబ్‌షావలి ఫర్టిలైజర్స్ షాపులో పురుగుల మందును కొనుగోలు చేశారు. సుమారు 40 ఎకరాల్లో పత్తిచేనులో పురుగులమందును పిచికారీ చేయగా, నాసిరకం మందులు కావడం వల్ల పత్తిచేలు మొత్తం మాడిపోయాయని తెలిపారు. దీంతో పత్తికాయలు, మొగ్గలు, ఆకులతో సహా రాలిపోతున్నాయని, మొక్కలు చనిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పురుగుల మందు విక్రయదారుడిని నిలదీస్తే సరైన సమాధానం చెప్పకుండా దాటవేస్తున్నాడని, అతడిపై చర్యలు తీసుకుని తమకు పంట నష్టపరిహారం అందించాలని రైతులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు.

జిల్లా లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ సస్పెన్షన్

మట్టెవాడ, ఆగస్టు 26: వరంగల్ జిల్లా లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ బి.ప్రవీణ్ కుమార్‌ను సస్పెండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర లీగల్ మెట్రాలజీ కంట్రోలర్ డీఎస్. చౌహాన్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రవీణ్‌కుమార్ హైదరాబాద్‌లో పని చేసిన సమయంలో పెట్రోల్ బంక్‌ల డీలర్లు, లైసెన్స్‌డ్ మ్యానుఫ్యాక్చర్ డీలర్స్, వే బ్రిడ్జి వ్యాపారులు, పరిశ్రమల యజమానులు, షాపింగ్ మాల్ యజమానుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేశారని, ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నాడని లీగల్ మెట్రాలజీ విభాగంలో రిటైర్డ్ ఇన్‌స్పెక్టర్ లీగల్ మెట్రాలజీ కంట్రోలర్‌కు విజిలెన్స్ శాఖకు లిఖితపూర్వకంగా 2020లో ఫిర్యాదు చేశారు. సుదీర్ఘకాలంగా రాష్ట్ర లీగల్ మెట్రాలజీ విభాగం అధికారులు విచారించి ప్రాపర్టీ స్టేట్‌మెంట్ ఆస్తుల విలువ, జీతభత్యాల కంటే మించి ఎక్కువగా ఉందని శాఖ పరమైన విచారణలో తేలింది. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్లు 2020లో ఫిర్యాదు చేసిన రిటైర్డ్ లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ కరుణాకరరెడ్డి ఫిర్యాదుతో విచారించిన రాష్ట్ర లీగల్ మెట్రాలజీ అధికారులు వరంగల్‌లో పని చేస్తున్న డీఎల్ఎంఓ బి.ప్రవీణ్ కుమార్‌ను సస్పెండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర కంట్రోలర్ లీగల్ మెట్రాలజీ డీహెచ్.చౌహాన్ ఉత్తర్వులు జారీ చేశారు.

శ్రీకృష్ణుడి అలంకరణలో భద్రకాళి అమ్మవారు

వరంగల్ కల్చరల్, ఆగస్టు 26: లోక కల్యాణార్థం విష్ణుపంచాయతన యాగం నిర్వహణతోపాటు కృష్ణాష్టమి వ్రతం, పూజలు భద్రకాళి అమ్మవారి దేవాలయంలో సోమవారం వైభవంగా నిర్వహించారు. భద్రకాళి అమ్మవారిని శ్రీకృష్ణుడిగా అలంకరించి పూజలు చేశారు. ఉదయం అమ్మవారికి నిత్యాహ్నికం, నిత్య పూజల అనంతరం శ్రీకృష్ణ జన్మాష్టమి వ్రతం చేశారు. సాయంత్రం గోధూళి వేళ భద్రకాళి అమ్మవారిని శ్రీకృష్ణుడిగా అలంకరించి పూజాధికాలు నిర్వహించారు. ఈమేరకు 21మహా నైవేద్యాలను సమర్పించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించు కున్నారు. ఆలయ ఈవో శేషు భారతి, ప్రధానార్చకులు భద్రకాళిశేషు, సూపరింటెండెంట్ అద్దంకి విజయ్‌కుమార్, దేవాలయ సిబ్బంది, సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీకృష్ణుడి అలంకరణలో భద్రకాళి



వెండి గంగాళాన్ని అందజేస్తున్న వినయ్‌భాస్కర్

వెండి గంగాళం కానుక

అమ్మవారికి వెండి గంగాళాన్ని మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ దంపతులు బహూకరించారు. సోమవారం అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ ఈవో శేషు భారతికి రెండు కిలోల బరువుగల దాదాపు రూ.2లక్షల విలువైన గంగాళం సమర్పించారు.

కదులుతున్న డొంక

- ఉమ్మడి వరంగల్ జిల్లాకు తాకిన సీఎంఆర్ఎఫ్ నిధుల స్కామ్
- నగరంలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో సీఐడీ బృందాల తనిఖీలు



వరంగల్ మెడికల్, ఆగస్టు 26: ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) నిధుల స్వాహా కుంభకోణం ఉమ్మడి వరంగల్ జిల్లాను తాకింది. ఈ భారీ స్కామ్‌లో నగరంలోని పలు కార్పొరేట్ ఆస్పత్రులు భాగస్వామ్యమైనట్లు ప్రాథమికంగా గుర్తిస్తున్నారు. తొలుత రాష్ట్ర రాజధానిలో ఈ వ్యవహారం వెలుగులోకి రాగా, లోతుగా విచారణ జరిగింది. ఈ క్రమంలో ఈ మూలాలు వరంగల్ ఉమ్మడి జిల్లాకు కూడా తాకినట్లు తెలుస్తోంది. హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా ఉన్న ఓ కార్పొరేట్ ఆస్పత్రితోపాటు నగరంలోని పలు ప్రయివేట్ ఆస్పత్రులు, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కొన్ని ఆస్పత్రుల పేర్లు వినిపిస్తున్నాయి. ఇప్పటికే సీఐడీ బృందాలు హనుమకొండకు చేరుకున్నాయి. మూడు బృందాలుగా విడిపోయి పలు ఆస్పత్రులపై తనిఖీలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో ఆస్పత్రి యాజమాన్యాలకు నేరుగా సంబంధం ఉందా, లేదంటే ఉద్యోగులు మాత్రమే నిధులు స్వాహా కోసం చేసిన పనా? అని విచారణలో తేలనుంది. కార్పొరేట్ ఆస్పత్రిలో పని చేసే కొందరు ఉద్యోగులు.. రోగులతో కుమ్మక్కై 50శాతం చొప్పున లావాదేవీలు మాట్లాడుకొని బిల్లులు సమర్పించి నిధులు స్వాహా చేసినట్లు ప్రాథమికంగా వెలుగులోకి వచ్చింది. అయితే ఈ కుంభకోణంలో ఎవరెవరూ ఉన్నారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ తతంగం వెనుక కొందరు ప్రజాప్రతినిధుల హస్తం కూడా ఉన్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

గతంలోనూ..

నగరంలోని కొన్ని ఆస్పత్రుల్లో చిన్న చిన్న జబ్బులకు సైతం పెద్ద ఎద్ద రోగాలు అంటగట్టి ఆరోగ్యశ్రీ, ఇన్సూరెన్స్, సీఎం రిలీఫ్ ఫండ్‌లను దర్జాగా కొల్లగొడుతున్నారు. హనుమకొండ బాలసముద్రంలోని ఓ ఆస్పత్రిలో ఇన్సూరెన్స్ కుంభకోణం ఆంధ్రజ్యోతి కథనంతో బయటపడగా ఇన్సూరెన్స్ అధికారులు ఆస్పత్రిని బ్లాక్‌లిస్టులో పెట్టారు. 20 ఏళ్ల కిందట గర్భసంచి తొలగింపు ఆపరేషన్లు ఉమ్మడి వరంగల్ జిల్లాలో వివాదాస్పదంగా నిలిచాయి. అవసరం లేకున్నప్పటికీ కాసుల కక్కుర్తితో ఈ ఆపరేషన్లు చేశా రని విచారణలో వెల్లడైంది. ఇలాగే నగరంలోని పలు కార్పొరేట్ ఆస్పత్రులు కాసుల కక్కుర్తితో పలు అక్రమాలకు పాల్పడుతున్నట్లు అనేక సందర్భాల్లో వెలుగులోకి వచ్చాయి. అధికారులు చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఆస్పత్రి యాజమాన్యాల్లో మార్పు రాకపోవడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇలాంటి ఆస్పత్రులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోకపోవడంవల్ల ఈ తరహా కుంభకోణాలు తరుచూ జరుగుతున్నట్లు రోగులు వాపోతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి కార్పొరేట్ ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

వీసీల నియామకంలో జాప్యం తగదు

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠ రెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 26: రాష్ట్రంలోని యూనివర్సిటీల వీసీల నియామకంలో ప్రభుత్వం చేస్తున్న కాలయాపన తగదని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ అన్నారు. సోమవారం హనుమకొండలోని హోటల్ హరిత కాకతీయలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి జాప్యం చేయకుండా వర్సిటీలకు వీసీలను నియమించాలన్నారు. అన్ని హామీలను అమలు చేస్తున్నామంటున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విద్యార్థుల హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలన్నారు. రాష్ట్రంలో విద్యారంగం సతమతమవుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గురుకులాల్లో విద్యార్థుల మరణాలు బాధాకరమని, మరణాలపై ప్రభుత్వం విచారణ చేపట్టాలన్నారు.

రాష్ట్రంలోని అన్ని గురుకులా ల్లో మౌలిక వసతులను మెరుగుపరచాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఊట్కూరి ప్రణీత్, భాష బోయిన సంతోష్, జిల్లా నాయకులు రవితేజ, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

అత్యాచార ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలి

బాలసముద్రం, ఆగస్టు 26: కోల్‌కత్తాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన అత్యాచార ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టి విద్యార్థినులకు రక్షణ కల్పించాలని తెలంగాణ జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ దుబ్యాల శ్రీనాథ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిలా పార్కులో సోమవారం సాయంత్రం ఆర్జీ కార్ ఆస్పత్రిలో అత్యాచారానికి గురై ప్రాణాలు కోల్పోయిన మెడికల్ విద్యార్థినికి న్యాయం జరిపించాలని కోరుతూ జూనియర్ డాక్టర్లు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించి ఏకశిలా పార్కులో కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహారావు పాల్గొని మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కాకతీయ మెడికల్ కాలేజ్ జూనియర్ డాక్టర్లు లోకేష్, డాక్టర్ కశ్యాప్, డాక్టర్ కావ్య, డాక్టర్ నిఖిల్, డాక్టర్, అష్రాఫ్, డాక్టర్ అమిత్, డాక్టర్ భవ్య, డాక్టర్ నవనీత్ తదితరులు పాల్గొన్నారు.



ఏకశిలా పార్కులో జరిగిన సమావేశంలో పాల్గొన్న జూనియర్ డాక్టర్లు

ఉరివేసుకుని విద్యార్థిని ఆత్మహత్య


బానోత్ నిఖిత (ఫైల్)

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 26 : ఉరివేసుకుని విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన మహబూబాబాద్ మండలం రోటిబండతండా శివారు దూద్యతండాలో సోమవారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై దీపికరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. దూద్యతండాకు చెందిన బానోత్ రమేష్-జ్యోతి దంపతులు వ్యవసాయం సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వారికి కుమారుడు, కుమార్తె సంతానం. కుమార్తె నిఖిత (16) మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యనభ్యసిస్తోంది. ఆదివారం సెలవుదినం కావడంతో నిఖిత తల్లిదండ్రులతో కలిసి వ్యవసాయ బావి వద్దకు వెళ్లింది. ఈ క్రమంలో మధ్యాహ్నం ఇంటికి వెళ్లి అన్నం తీసుకురమ్మని కూతురుకు తల్లి చెప్పింది. అక్కడ్నుంచి ఇంటికి వెళ్లిన నిఖిత ఎంతసేపటికి అన్నం తీసుకుని పొలం వద్దకు రాకపోవడంతో తల్లి వ్యవసాయ పొలం నుంచి ఇంటి వద్దకు వెళ్లింది. అప్పటికి నిఖిత ఫోన్ పట్టుకుని ఉండడంతో కొప్రొద్రికురాలైన తల్లి ఇంతసేపటికి అన్నం ఎందుకు తీసుకురాలేదని కుమార్తెను మందలించింది. ఆ తర్వాత తల్లి అన్నం తీసుకుని పొలం వద్దకు వెళ్లింది. సాయంత్రం వ్యవసాయ పనులు ముగించుకుని తల్లిదండ్రులు ఇంటికి వచ్చి చూసే సరికి నిఖిత ఇంట్లో ఉరివేసుకుని విఘత జీవిగా కన్పించింది. దీంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. తండ్రి రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వరకట్న వేధింపులతో వివాహిత ఆత్మహత్య

డోర్నకల్ (మహబూబాబాద్ జిల్లా), ఆగస్టు 26 : అత్తింటి వారి వరకట్న వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అందనాలపాడులో సోమవారం చోటు చేసుకుంది. డోర్నకల్ సీఐ రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం. అందనాలపాడుకు చెందిన కనక మహేందర్ అనే వ్యక్తికి సూర్యాపేట జిల్లా మోతె మండలం మామిండ్లగూడెంకు చెందిన నవిలే కృష్ణ కుమార్తె మౌనిక (26)ను ఇచ్చి గతేడాది వివాహం జరిపించారు. పెళ్లి సమయంలో రూ.5 లక్షల నగదు, 5 తులాల బంగారం కట్నంగా ఇచ్చారు. కొంతకాలం సాఫీగా కాపురం సాగింది. ఆ తర్వాత భర్త, అత్తామామలు, అడప డుచులు కలిసి మౌనికను అదనపు కట్నం తీసుకురావాలి వేధింపులకు గురి చేస్తున్నారు. దీంతో మనోవేదనకు గురైన మౌనిక ఈనెల 22న ఇంట్లో ఉన్న బీపీ మాత్రలను ఎక్కువ మోతాదులో వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఇది గమనించిన కుటుంబసభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం వెం టనే ఖమ్మంలోని ఓప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు సూచన మేరకు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కార్పొరేట్ ఆస్పత్రికి తరలిం చారు. అక్కడ ఆరోగ్య పరిస్థితి విషమించి మౌనిక మృతి చెందింది. తన కుమార్తె మృతికి ఆమె భర్త, అత్తా అడపడుచునే కారణమని మౌనిక తండ్రి నవిలే కృష్ణ డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశాడు. ఆయన ఫిర్యాదు మేరకు మౌనిక భర్త కనకం మహేందర్‌తో పాటు అతని తల్లి సత్యవతి, సోదరి స్వప్నతోపాటు ఆమె భర్త తిరుపతయ్య, బంధువులు జయమ్మ, ఏసుపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అప్పులబాధతో వ్యాపారి ఆత్మహత్య


సుద్దాల కార్తీక్(ఫైల్)

కమలాపూర్, ఆగస్టు 26: అప్పుల బాధతో వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కమలాపూర్ మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ హరికృ ష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సుద్దాల కార్తీక్(38) కొన్నేళ్లుగా సూపర్‌మార్కెట్ ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. కొద్దినెలలుగా అప్పులబాధ ఎక్కువ అవడంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. ఈ క్రమంలోనే అనారోగ్యానికి గురయ్యాడు. అప్పుల బాధలు ఎక్కువవడం.. అనారోగ్య పరిస్థితులు తట్టుకోలేక సోమ వారం కార్తీక్ ఉరివేసుకుని చనిపోయినట్లు అతడి భార్య అర్చన పోలీసుల ఫిర్యాదులో తెలిపింది. అర్చన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ హరికృష్ణ తెలిపారు.

4.7 కిలోల గంజాయి పట్టివేత

కాజీపేట, ఆగస్టు 26: యువకులు గంజాయి సేవిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. కాజీపేట ఎస్సై నవీన్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాజీపేటలో ఆదివారం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా బడల శ్రవణ్ కుమార్, కిలారి శోభన్ కుమార్, సయ్యద్ షకీల్, పోలీసులను చూసి పారిపోతుండగా వారిని అదుపులోకి తీసుకుని తనిఖీలు చేశారు. వారి వద్ద ప్లాస్టిక్ కవర్‌లలో 4.7కిలో గంజాయి పట్టుబడింది. వీరి స్నేహితులైన సయ్యద్ సాహెద్ అలీ, భైరబోయిన శ్రవణ్‌ల వద్ద ఆ గంజాయి కొనుగోలు చేసినట్లు చెప్పారు. పట్టుబడ్డ వారివద్ద దొరికిన గంజాయి విలువ రూ 1, 17,500 ఉంటుందని పోలీసులు తెలిపారు. గంజాయితో పట్టుబడ్డ వారిపై సోమవారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని, గంజాయి సప్లయ్ చేసే సయ్యద్ సాహెద్ అలీ, భైరబోయిన శ్రవణ్‌లు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.



హనుమకొండ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లిం ఐక్యవేదిక సభ్యులు

వైద్య విద్యార్థినిపై హత్యాచారం చేసిన నిందితులను ఉరితీయాలి

హనుమకొండ చౌరస్తాలో ముస్లిం ఐక్య వేదిక అధ్వర్యంలో నిరసన

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 26: కోల్‌కత్తా నగరంలో వైద్య విద్యార్థినిపై హత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను ఉరితీయాలని ముస్లిం ఐక్యవేదిక ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ ఎం.డి. నయిమొద్దిన్ డిమాండ్ చేశారు. సోమవారం ముస్లిం ఐక్య వేదిక ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో హనుమకొండ చౌరస్తాలో వైద్య విద్యార్థి హత్యాచార ఘటనను నిరసిస్తూ ర్యాలీ, నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నయిమొద్దిన్ పాల్గొని మాట్లాడారు. దేశంలో రోజురోజుకూ మహిళలపై హత్యాచారాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దుండగులు చిన్నపిల్లలను సైతం వదిలిపెట్టం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ అనిస్‌సిద్ధిఖీ మాట్లాడుతూ.. వైద్య విద్యార్థినిపై హత్యాచారం చేసిన నిందితులకు శిక్ష విధించేలా కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజమహ్మద్, షేక్‌బాబా, మోసిన్, ఎంఏ రషద్, తాసిమ్, గౌస్, యాకూబ్, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్మగ్లర్‌పై పీడీ యాక్టు


పీడీ యాక్ట్ ఉత్తర్వులు అందిస్తున్న పోలీసులు

వరంగల్ క్రైం, ఆగష్టు 26: గంజాయి స్మగ్లర్‌పై వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సోమవారం పీడీ యాక్టు నమోదు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వరంగల్ మీదుగా మహారాష్ట్రకు గంజాయి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న భూపాలపల్లి జిల్లా గోరికొత్తపల్లి ప్రాంతానికి చెందిన గజ్జి సహదేవ్‌రాజ్‌పై సీపీ పీడీ యాక్ట్ నమోదు చేశారు. ఈ ఉత్తర్వులను శాయంపేట సీఐ రంజిత్‌రావు, దామెర ఎస్ఐ అశోక్ నిందితుడికి పరకాల సబ్ జైలులో అందచేసి చర్లపల్లి జైలుకు తరలించారు. పీడీ యాక్టు అందుకున్న నిందితుడు సహదేవ్‌రాజ్.. జూన్ 8న మరో ఇద్దరితో కలిసి ఆంధ్రప్రదేశ్ నుంచి మహారాష్ట్రకు గంజాయిని తరలిస్తుండగా టాస్క్‌ఫోర్స్, దామెర పోలీసులు కలిసి పట్టుకున్నారు. వీరి నుంచి రూ.50లక్షల విలువైన గంజాయి, ఒక కారు స్వాధీనం చేసుకుని జైలుకు తరలించారు. కాగా, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే పీడీ యాక్టు నమోదు చేస్తామని సీపీ అంబర్ కిషోర్ ఝా ఈ సందర్భంగా హెచ్చరించారు.

యూనిఫైడ్ పెన్షన్ కాదు, పాత పెన్షన్ కావాలి

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 26: ప్రభుత్వం యూనిఫైడ్ పెన్షన్ ఇస్తానంటోందని, కావాల్సింది పాత పెన్షన్ అని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఇది సీపీఎస్‌కు మరో రూపమే తప్ప. పాత పెన్షన్ విధానం కాదని ఆయన పేర్కొన్నారు. కొత్త సీసాలో పాత సారాయి వంటిదే యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ అని తెలిపారు. ప్రభుత్వ పునరాలోచించి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఆయన కోరారు.

ఆధ్యాత్మిక, చారిత్రక సందర్శన కోసం..

నేడు ఉమ్మడి జిల్లాకు గవర్నర్ రాక ● నేటి నుంచి 29వ తేదీ వరకు పర్యటన ● విస్తృత ఏర్పాట్లు చేసిన ఆయా జిల్లాల కలెక్టర్లు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ తన మూడు రోజుల పర్యటన కోసం ఉమ్మడి వరంగల్ జిల్లాను మంగళవారం రానున్నారు. తొలుత ఏజెన్సీ ప్రాంతమైన ములుగు నుంచి తన పర్యటన ప్రారంభిస్తారు. 27వ తేదీన ములుగు జిల్లాలోని చారిత్రత్మక కట్టడం, యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయాన్ని గవర్నర్ సందర్శించనున్నారు. శ్రీరామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. యునెస్కో గుర్తింపు పొందిన రామప్పను 2022 డిసెంబరు 28న రాష్ట్రపతి ద్రౌపదిముర్ము సందర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ పథకం కింద మంజూరు చేసిన నిధులతో చేపట్టే పనులకు రాష్ట్రపతి శంకుస్థాపనలు చేశారు. రాష్ట్రపతితో పాటు అప్పటి గవర్నర్ తమిళిసై కూడా రామప్పను సందర్శించారు. మంగళవారం జిష్ణుదేవ్‌వర్మ రామప్పకు వస్తుండటంతో యునెస్కో గుర్తింపు పొందిన తరువాత చారిత్రాత్మక కట్టడాన్ని దర్శించుకున్న రెండో గవర్నర్ కానున్నారు. అలాగే పక్కనే ఉన్న భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలోని కోటగుళ్లను గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ సందర్శించనున్నారు. కాకతీయులకాలంలో నిర్మించిన కోటగుళ్ల అందాలను వీక్షించటంతో పాటు ఆలయంలో ప్రత్యేక పూజలు చేయనున్నారు. అలాగే తనపర్యటనలో రెండో రోజు 28వ తేదీ బుధవారం మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6.30గంటల వరకు చారిత్రాత్మక వేయిస్తంభాల ఆలయం, భద్రాకాళి దేవాలయం, పద్మాక్షమ్మ ఆలయాలను గవర్నర్ దర్శించుకోన్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. వీటితో పాటు వరంగల్ నగరంలో ఉన్న ఇతర ప్రముఖ ఆలయాలను గవర్నర్ సందర్శించే అవకాశం ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.



లక్నవరం, వరంగల్ కోటకు..

గవర్నర్ తన పర్యటనలో లక్నవరం సరస్సును సందర్శించనున్నారు. తొలి రోజు 27వ తేదీన రాత్రి 7గంటలకు లక్నవరంలోని గెస్ట్‌హౌస్‌కు చేరుకుని అక్కడే బస చేయనున్నారు. ఏజెన్సీ ప్రాంతమైన లక్నవరం గెస్ట్‌హౌస్‌లో రాత్రిబస చేయనున్న తొలి గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మనే కావటం విశేషం. 28వ తేదీ బుధవారం ఉదయం 6 గంటల నుంచి 9గంటల వరకు లక్నవరం ప్రకృతి అందాలను వీక్షించనున్నారు. ఊయల వంతెనపై పర్యటిస్తారు. సాయంత్రం 6 గంటలకు వరంగల్ కోటను గవర్నర్ సందర్శించనున్నారు. కాకతీయుల కాలం నాటి అపురూప శిల్ప సంపదను పరిశీలించనున్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం వరంగల్ కోటలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టింది. వాటిని గవర్నర్ పరిశీలించనున్నారు.

అవార్డు గ్రహీతలు, ఉన్నతాధికారులతో భేటీ

తన పర్యటనలో గవర్నర్ వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచి అవార్డులు పొందిన వారిని కలువనున్నారు. జిల్లాకు 25మంది చొప్పున జిల్లా కలెక్టర్ ఎంపిక చేసిన వారిని గవర్నర్ సత్కరించనున్నారు. వారితో కొద్దిసేపు రచనలు, కవిత్వం, సాహిత్యంపై ముచ్చటించనున్నారు. అలాగే ములుగు, హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లా కలెక్టరేట్‌లలో ఉన్నతాధికారులతో గవర్నర్ భేటీ కానున్నారు. జిల్లాల అభివృద్ధిలో అధికారుల పాత్రపై చర్చించనున్నారు. అధికారులతో కలిసి లంచ్ చేయనున్నారు. 27వ తేదీ ములుగు జిల్లా కలెక్టరేట్ నుంచి ప్రారంభమయ్యే గవర్నర్ పర్యటన.. 29వ తేదీ మధ్యాహ్నం జనగామ జిల్లా ఒబుళకేశ్వాపూర్ వద్ద ముగుస్తుంది. అక్కడి నుంచి మధ్యాహ్నం 2.10గంటలకు గవర్నర్ రోడ్డు మార్గాన భువనగిరి జిల్లా కొలనుపాకు వెళ్లటంతో మూడు రోజుల గవర్నర్ పర్యటన ముగుస్తుంది.

తొలిరోజు గవర్నర్ పర్యటన ఇలా..

27వ తేదీ మంగళవారం ఉదయం 7గంటలకు తన నివాసగృహం నుంచి గవర్నర్ రోడ్డుమార్గాన బయలుదేరి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్టలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి ఉదయం 8గంటలకు చేరుకుంటారు. స్వామి వారిని దర్శించుకుని అక్కడి నుంచి ఉదయం 8.45లకు రోడ్డు మార్గాన బయలుదేరి 11.30గంటలకు ములుగు జిల్లా కలెక్టరేట్‌కు చేరుకోనున్నారు. 12 గంటల వరకు విశ్రాంతి తీసుకుంటారు. మధ్యాహ్నం 1గంటలకు ఉన్నతాధికారులతో పరిచయం కార్యక్రమం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 1గంట నుంచి 3గంటల వరకు రచయితలు, ఆర్టిస్టులతో పాటు రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు పొందిన వారితో సమావేశం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయాన్ని పరిశీలించనున్నారు. పక్కనే ఉన్న భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలోని గణపేశ్వరాలయంను గవర్నర్ సందర్శించనున్నారు. అక్కడి నుంచి గోవిందరావుపేట మండలంలోని లక్నవరం సరస్సు సాయంత్రం 6.30గంటలకు చేరుకుని అక్కడే రాత్రి బస చేయనున్నారు. కాగా, గవర్నర్ పర్యటన నేపథ్యంలో లక్నవరంలో సోమవారం మంత్రి సీతక్క ఏర్పాట్లు పరిశీలించారు.

కేంద్ర ప్రభుత్వం వెంటనే కులగణనను చేపట్టాలి


ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న కొంగర అనిల్‌కుమార్, డీఎస్. ప్రభాకర్

వడ్డెపల్లి, ఆగస్టు 26: కేంద్ర ప్రభుత్వం వెంటనే కులగణనను చేపట్టాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహాసేన (ఎస్ఎస్‌బీఎం) జాతీయ అధ్యక్షుడు కొంగర అనిల్‌కుమార్, జాతీయ ఉపాధ్యక్షుడు డీఎస్. ప్రభాకర్, రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు దామెర కరుణ డిమాండ్ చేశారు. హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలను ఒకేతాటిపైకి తీసుకొచ్చి రాజ్యాధికారాన్ని సాధించేందు కోసం తమ సంస్థ కృషి చేస్తుందని అన్నారు. కులగణన చేపట్టాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సెప్టెం బరు 7న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించే మహాధర్నాలో అన్ని కులాలకు చెందిన వారంతా పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో ఎస్ఎస్‌బీఎం రాష్ట్ర అధ్యక్షుడు గాదెపాక అనిల్, తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొనగాని యాదగిరి గౌడ్, వివిధ ప్రజా సంఘాల నాయకులు వస్కుల విజయ్‌కుమార్, ఇమ్మడి బాబు, నద్దునూరి సంపత్, ఇసంపెల్లి అబ్రహం, ఎం.డి. సుబాన్, కరుణాకర్, గడ్డం ప్రతాప్, మంద కుమార్ తదితరులు పాల్గొన్నారు.

29న వక్తృత్వ పోటీలు

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 26: తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 29న అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు వక్తృత్వ పోటీలను నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బూర భిక్షపతి, డాక్టర్ మార్క శంకర్ నారాయణ సోమవారం ఒక ప్రటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10.30 గంటలకు హనుమకొండ లష్కర్ బజార్‌లోని బీఈడీ కళాశాలలో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. 9వ తరగతి నుంచి పీజీ చదివే విద్యార్థులు విద్యా సంస్థకు ఇద్దరు చొప్పున పాల్గొనే అవకాశం ఉందని తెలిపారు. 'ప్రభుత్వ కార్యాలయాల్లో తెలుగు భాష ఆవశ్యకత' అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

నేటి నుంచి ఐదేళ్ల ఇంటిగ్రేటేడ్ కోర్సుల పరీక్షలు

కేయూ క్యాంపస్, ఆగస్టు 26: కాకతీయ యూనివర్సిటీ ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సులైన బయో టెక్నాలజీ, కెమిస్ట్రీ కోర్సుల పరీక్షలు ఆగస్టు 27 మంగళవారం నుంచి జరుగుతాయని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 27, 28, 29, 31. సెప్టెంబరు 2, 4, 6వ తేదీల్లో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. విద్యార్థులకు పరీక్షల కేంద్రాన్ని కేయూ క్యాంపస్‌లోని కెమిస్ట్రీ విభాగంలో ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇతర వివరాలకు వర్సిటీ ప్రిన్సిపాల్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

పీడీఎస్ రైస్ పట్టివేత

రూ.8వేల విలువైన 5 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం

హసన్‌పర్తి, ఆగస్టు 26: మండలంలోని జయగిరిలో నిబంధనలకు విరుద్ధంగా లబ్ధిదారుల వద్ద నుంచి సేకరించి అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు. ఇన్‌స్పెక్టర్ కథనం ప్రకారం.. మండలంలోని జయగిరికి చెందిన దండుగుల సాయిలు, దండుగుల కొమురమ్మలు ఇదే గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ పోలు అశోక్‌లు సోమవారం మడిపల్లిలో ఇంటింటికి తిరిగి కిలో రూ.8 చొప్పున కొని కోళ్లఫామ్‌లలో రూ.16చొప్పున అమ్ముతున్నారు. లబ్ధిదారుల నుంచి 10 ప్లాస్టిక్ బ్యాగులలో సుమారు 5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని సేకరించి తరలిస్తున్నారు. ఈ క్రమంలో మడిపల్లిలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లు పి.రాజయియ్య, వి.విద్యాసాగర్‌లకు అనుమానాస్పదంగా ఆటో కనిపించగా వారిని చూసి పారిపోయే ప్రయత్నం చేశారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు వారిని వెంబడించి అదుపులోకి తీసుకొని విచారించగా పీడీఎస్ రైస్ తరలిస్తున్నట్లు అంగీకరించినట్లు తెలిపారు. పీడీఎస్ రైస్‌ను అక్రమంగా తరలిస్తున్న ఆటో డ్రైవర్ పోలు అశోక్‌తో పాటు రేషన్ బియ్యాన్ని సేకరిస్తున్న దండుగుల సాయిలు, దండుగుల కొమురమ్మలను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద 8 క్వింటాళ్ళ పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు.

ఆనాడు అడవిలోనే రామప్ప!

- సుమారు 500 ఏళ్లపాటు కారడవిలో..
- 1951లో పురావస్తు శాఖ ఆధీనంలోకి..
- ప్రాకారానికి జీవం పోసిన ఎస్‌కే యాజ్దనీ
- 1960లో రాజమౌళి తొలిపూజ


44 యేళ్ల కిందటి రామప్ప దేవాలయం (పాత చిత్రం)


రామప్పలో మొదటగా పూజలు చేసిన పూజారి రాజమౌళి (సర్కిల్‌లో)

వెంకటాపూర్(రామప్ప), ఆగస్టు 26: ప్రపంచ వారసత్వ కట్టడంగా యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం ఒకప్పుడు మనకబారి ఉండేది. చరిత్ర కాలగర్భంలో నుంచి ప్రస్తుతం భారతదేశానికే తలమానికమైన ఖ్యాతిని గడించింది రామప్ప. క్రీస్తుశకం 1213వ శతాబ్దంలో కాకతీయ సామంతరాజులు ఏలిన కాలంలో ప్రధాన దైవం శివుడు, ఉత్సవ దైవం రామలింగేశ్వరుడితో నిర్మితమైంది రామప్ప దేవాలయం. ఆ తర్వాత కాలగమనంలో నిర్లక్ష్యానికి గురైంది. కొన్ని వందల సంవత్సరాలు రామప్ప దేవాలయం నిర్వహణ లేక రామలింగేశ్వరుడికి పూజలు లేక, ధూప దీప, నైవేద్యాలు లేక నిర్లక్ష్యానికి గురైంది. తెలంగాణ, మహారాష్ట్ర ప్రాంతాలను ఏలిన నిజాంపాలనలో ఈరామప్ప దేవాలయం వెలుగులోకి వచ్చింది. 1900 సంవత్సరంలో అప్పటి ముస్లిం రాజుల వద్ద పనిచేసే ఆసిఫ్ జాహీల్ తెలంగాణలోని ములుగు ప్రాంతానికి వేటకు వచ్చాడు. ఆసమయంలో కారడవిలో రామప్ప దేవాలయం ఆయన కంటపడింది. ఆయన దాన్ని వెలుగులోకి తీసుకువచ్చాడు. రామప్ప ఆలయం అంచు (చూరు) పడిపోకుండా డంగుసున్నంతో చుట్టూ దిమ్మెలు ఏర్పాటు చేయించి, చుట్టుపక్కల ప్రాంతాలను శుభ్రం చేసి పడిపోకుండా రామప్పను కాపాడినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. అప్పటి నుంచి వెలుగులోకి వచ్చిన రామప్ప దేవాలయాన్ని కేంద్ర పురావస్తుశాఖ సుమారు 1951లో తమ ఆధీనంలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఎన్నో ఇబ్బందులనోర్చి ప్రస్తుతం ప్రపంచ ముఖచిత్రంలో చోటు సంపాదించుకుంది రామప్ప.

ప్రాకారానికి జీవం పోసింది ఇతడే..

1951లో కేంద్ర పురవస్తుశాఖ ఆదీనంలోకి వెళ్లిన రామప్ప దేవాలయం 1911లో నిజాంపాలనలో కేంద్రపురావస్తుశాఖ మొదటి డైరెక్టర్ ఉన్న ఎస్‌కే యాజ్దనీ రామప్ప ఆలయాన్ని సందర్శించారు. ఆలయంపై భాగంలో ఉన్న నక్షత్రాకారపు ప్రాకారం కూలిపోయో దశలో ఉండడాన్ని పసిగట్టిన ఆయన.. వెంటనే రామప్ప ఆలయానికి దక్షిణ భాగానికి రెండు వైపులా 7 స్థంభాలు, ఉత్తర భాగంలో మూడు స్థంభాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆ మేరకు స్థంభాలను నిలబెట్టి నక్షత్రాకారపు ప్రాకారాన్ని ఈ తరానికి అందించారు. ఈరోజుల్లో ఆయన చూపిన చొరవే రామప్ప ఆలయం ప్రపంచ దృష్టిని ఆకర్శిస్తోంది.

1960లో తొలిపూజ

కేంద్ర పురవస్తుశాఖ ఆధీనంలోకి రామప్ప ఆలయం వచ్చాక 1960లో తొలిపూజ జరిగినట్లు స్థానిక ప్రజలు చెబుతున్నారు. రామప్ప ఆలయంలో పూజలు చేయడానికి పూజారులు లేకపోవడంతో పాలంపేట గ్రామానికి చెందిన రాష్ట్ర మాజీ జలవనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ వీరమళ్ల ప్రకాశ్ తండ్రి అలనాటి అస్సల్దార్ మాల్‌పటేల్ వీరమళ్ల రాజనర్సింహ పటేల్ ఆధ్వర్యంలో స్టేషన్ ఘన్‌పూర్ మండలంలోని తాటికొండ గ్రామానికి చెందిన అవునూరిమఠం రాజమౌళి ద్వారా పూజలు జరిపినట్లు చరిత్రతో పాటు స్థానికులు చేబుతున్నారు.

2001లో రామప్ప గోపురానికి జీర్ణోద్ధరణ


17వ శతాబ్దంలో భూకంపం సంభవించినప్పుడు రామప్ప దేవాలయంలో గల గర్భగుడిలో ఉన్న శివలింగం ఒకపక్క ఒరిగడంతో అప్పటి నుంచి ఎలాంటి మరమ్మతులు చేయలేదు. 2001 ఫిబ్రవరిలో రాష్ట్ర దేవాదాయ, కేంద్రపురావస్తుశాఖ ఆధ్వర్యంలో మరమ్మతులు చేసి శివలింగాన్ని సరిచేసి ప్రాణప్రతిష్ట చేసి పునఃప్రతిష్ఠించినట్లు చరిత్ర చెబుతోంది. దీన్నే (జీర్ణోద్ధరణ) అని అంటారు. ఆ తరువాత ఆలయ గోపురంపై కలశం లేకపోవడంతో ఆదే మాసంలో ఆలయంలో కలశానికి ప్రత్యేక పూజలు చేసి గోపురంపై కలశం ఏర్పాటు చేశారు. అనంతరం 2007 నుంచి మొదలుకొని 2009 వరకు అప్పటి సర్పంచ్ ఆకిరెడ్డి రాంమోహన్‌రావు ఆధ్వర్యంలో రుద్రహోమాలు చేసినట్లు ఆయన తెలిపారు. అప్పటి నుంచి రామప్పలో ప్రతీ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తూ వస్తున్నట్లు ప్రస్తుత పూజారులు తెలిపారు.


2001లో గోపురంపై కలశం ప్రతిష్ఠించేందుకు పూజలు చేస్తున్న పురోహితులు (పాత చిత్రం)

ఐలాండ్‌లో రామప్ప

త్వరలో రామప్ప సరస్సు మధ్యలో నిర్మాణం


రామప్ప సరస్సులోని ఐలాండ్ (పాతచిత్రం)


ఈ తరహాలో భారీ శివుడి విగ్రహం ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం

వెంకటాపూర్(రామప్ప), ఆగస్టు 26: ప్రపంచ వారసత్వ సంపదగా యునెస్కో గుర్తించిన నేపథ్యంలో రామప్పను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర పర్యాటకశాఖ కృషిచేస్తోంది. ఇటీవల రామప్ప పర్యటనలో భాగంగా రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం రామప్ప అభివృద్ధిపై పర్యాటకశాఖ అధికారులతో చర్చించారు. యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయం భావితరాలకు స్ఫూర్తి దాయకం కావాలన్న సంకల్పంతో రామప్పలో కనీస ఏర్పాట్లు చేస్తోందని వివరించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో రామప్ప సరస్సులోని ఐదెకరాల ఐలాండ్‌లో భారీ శివుడి విగ్రహాన్ని ఏర్పాటుచేసి పర్యాటకులకు కనువిందు చేసేలా సకల హంగులు కల్పించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేవిధంగా రామప్పను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దేందుకు పర్యాటకశాఖ అడుగులు వేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇది ఆచరణలోకి వస్తే మాత్రం ప్రపంచ పర్యాటక ముఖచిత్రంలో రామప్ప అగ్రస్థానంలో నిలువనుంది. ములుగు జిల్లా ఖ్యాతి విశ్వవ్యాప్తం కానుంది.

విధులకు భయం భయంగా..

(5వ పేజీ తరువాయి)



నరకయాతన పడాల్సి వస్తోందని మహిళా వైద్యులు ఆందోళన చెందుతున్నారు.

వేధింపుల బారిన..

రెండు రోజుల కిందట వరంగల్ ఎంజీఎంలో రాత్రి విధుల్లో ఉన్న డాక్టర్ దీపిక (పేరు మార్చాం) రాత్రి 10గంటల సమయంలో ఓపీ నుంచి జనరల్ వార్డులోని రోగులను పరిశీలించేందుకు వెళుతుండగా ఓ వ్యక్తి వెంబడించారు. ఎవరు..? అని ప్రశ్నించినా సమాధానం లేదు. చుట్టూ చీకటి, సెక్యూరిటీ లేదు. సీసీ కెమెరాలు లేవు. ప్రాణాలను అరచేతిలో పెట్టకుని భయంతో జన రల్ వార్డుకు పరు గెత్తాల్సి వచ్చింది. దీంతో ఆ ఆగంతకుడు పరారయ్యాడు" అని ఓ లేడీ మెడికో వాపోయారు. ప్రభుత్వ ఆస్పత్రిలో 36గంటలు సేవ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, కానీ కనీస రక్షణ లేకపోతే ఎలా అని జూడాలు ప్రశ్నిస్తున్నారు. రాత్రిపూట రోగులతోపాటు వచ్చే వారిలో చాలామంది మద్యం సేవించి ఆస్పత్రికి వస్తున్నారని, చికిత్స చేస్తుండగా కొందరు, ఓపీ చూస్తుండగా మరికొందరు అసభ్యకరంగా ప్రవర్తిస్తుడటం ఇబ్బందిగా మారుతోందని జూడాలు వాపోతున్నారు. ఇది ఒక్క వరంగల్ ఎంజీఎంలోనే కాదు.. అన్ని ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొందని పేర్కొంటున్నారు.

సీసీ కెమెరాలు, షీటీమ్స్ పెట్రోలింగ్ నిర్వహించాలి..

డాక్టర్ అయోషా, పీజీ విద్యార్థిని, వరంగల్ కేఎంసీ



ప్రతీ ఆస్పత్రిలో జూనియర్ మహిళా డాక్టర్‌కు రక్షణ కల్పించాలి. ఒక్కోసారి 36గంటలకుపైగా డ్యూటీ చేయాల్సి వస్తోంది. రాత్రిపూట అకతాయిల నుంచి వేధింపులను ఎదుర్కోవాల్సి వస్తోంది. ఎంజీఎంతో పాటు అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల వద్ద ఎక్కువ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. షీ టీమ్స్‌తో రాత్రిపూట పెట్రోలింగ్ నిర్వహించాలి. స్థానిక పోలీస్‌స్టేషన్‌కు అనుబంధంగా ఔట్‌పోస్టు ఏర్పాటు చేసి సిబ్బందిని పెంచాలి.

రెస్ట్‌రూమ్ కేటాయించాలి..

డాక్టర్ భవ్య, పీజీ విద్యార్థిని



ఒక్కోసారి 36గంటలు నిరంతరం డ్యూటీ చేయాల్సి వస్తోంది. డ్యూటీ చేసే ప్రదేశంలో జూనియర్ డాక్టర్లకు ప్రత్యేకంగా రెస్ట్‌రూమ్‌లు ఉండటం లేదు. కనీసం బాత్‌రూమ్స్, వాష్‌రూమ్‌లు ఉండటం లేదు. రాత్రి వేళ కనీసం తాగేందుకు నీళ్లు కూడా ఉండటం లేదు. బయటకు వెళ్లి నీళ్ల కోసం వెళ్లలేని పరిస్థితి.

మానసిక ఒత్తిడిలో..

జూనియర్ డాక్టర్లు ఎదుర్కొంటున్న ఒత్తిడి నేపథ్యంలో ఇటీవల జాతీయ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) ఆధ్వర్యంలో నేషనల్ టాస్క్‌ఫోర్సు ఫర్ మెంటల్ హెల్త్, వెల్ బీయింగ్ దేశవ్యాప్తంగా 25,590 మంది ఎంబీబీఎస్, 5,337 మంది పీజీ వైద్య విద్యార్థులు, 7,035 మంది ఫ్యాకల్టీని ఆన్‌లైన్ సర్వే చేసి నివేదికను తయారు చేసింది. వీరిలో 28శాతం మంది ఎబీబీఎస్, 15శాతం మంది పీజీ విద్యార్థులు మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు సర్వేలో పేర్కొన్నారు. సర్వేలో పాల్గొన్న పీజీ విద్యార్థుల్లో 45శాతం మంది తాము వారానికి 60గంటలకు పైగానే పని చేశామని, 56శాతం మంది వారాంతపు సెలవు లేకుండా పని చేస్తున్నామని వెల్లడించారు.

ఎన్ఎంసీ ఏం సూచించిందంటే..

- జూనియర్ డాక్టర్లపై ఒత్తిడితో పాటు పనిభారాన్ని కూడా తగ్గించాలి.
- రెసిడెంట్ డాక్టర్లు వారానికి 74 గంటల కంటే ఎక్కువ పని గంటలు చేయొద్దు. వారాంతపు సెలవు ఇవ్వాలి.
- వైద్య విద్యార్థులు మానసిక ఒత్తిడిని, ఇతర సమస్యలను తట్టుకునేందుకు యోగా, క్రీడలు, తదితర కార్యక్రమాలను మెడికల్ కాలేజీల్లో నిర్వహించాలి.

విద్యార్థులు ఏం కోరుతున్నారంటే..

- మెడికల్ కాలేజీ ఆస్పత్రుల్లో 60 నుంచి 70శాతం మహిళ డాక్టర్లే విధులు నిర్వహిస్తున్నారు. వీరికి కనీస సౌకర్యాలు కల్పించాలి.
- జూనియర్ మహిళ డాక్టర్లు విధులు నిర్వహించే ఆస్పత్రిలో వారికి ప్రత్యేకంగా మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌లు ఏర్పాటు చేయాలి.
- 36 గంటలు డ్యూటీ చేయాల్సి ఉన్నందున రాత్రిపూట విశ్రాంతి తీసుకునేందుకు ప్రత్యేకంగా రెస్ట్‌రూమ్ ఏర్పాటు చేయాలి.
- ఎంజీఎం ఆస్పత్రి, మెడికల్ కాలేజీ, కంటి ఆస్పత్రి, కేఎంసీ మహిళ వసతి గృహాల వద్ద ఎక్కువ సీసీ కెమెరాలతో పాటు ఆస్పత్రుల చుట్టూ విద్యుత్ లైట్లను ఏర్పాటు చేయాలి.
- రాత్రిపూట ఆస్పత్రి చుట్టూ ఉన్న అన్ని గేట్లు మూసి, ఎమర్జెన్సీ గేటు, ఎగ్జిట్ గేటు మాత్రమే తెరిచి ఉంచాలి.
- ఔట్‌పోస్టులో ఎస్ఐ స్థాయి అధికారితో పాటు రాత్రి పూట కచ్చితంగా ఆస్పత్రి ప్రాంగణంలో పోలీస్ వాహనంలో షీటీమ్స్‌తో పెట్రోలింగ్ చేయాలి.
- రాత్రిపూట ఎంజీఎంతో పాటు మహిళ వైద్యుల హాస్టళ్ల వద్ద లేడీ సెక్యూరిటీ గార్డును నియమించాలి.
- ఎంజీఎం ఆస్పత్రి ఆవరణలో రాత్రిపూట నిద్రిస్తున్నవారిని పరిశీలించాలి. వారు రోగులకు సంబంధీకులా..? కాదా? గుర్తించి చర్యలు తీసుకోవాలి.
- రాత్రి 10గంటలు దాటితే తాగేందుకు నీళ్లు కూడా అందుబాటులో ఉండటం లేదు. 24 గంటలు తాగేనీరు అందుబాటులో ఉంచాలి.
- రోగులతోపాటు లోపలికి వచ్చేవారు మద్యం తాగి ఉన్నారో లేదో పరీక్షించిన తరువాతే లోపలికి పంపించాలి. అది కూడా ఒక్కరినే పంపించాలి.
- రోగుల అటెండర్ ఐడీ కార్డులు, ఆధార్‌కార్డులను సేకరించాలి
- ఓపీ, ఐపీ విభాగాలను వేర్వేరుగా నిర్వహించాలి.



నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్



ఎస్సైకి బ్యాగ్ ఇస్తున్న కిరణ్

వరంగల్ చౌరస్తా, ఆగస్టు 26: కాశిబుగ్గ శివాలయం వద్ద కదిరాల కిరణ్ అనే ఆటో డ్రైవర్ ఆటోలో ఒక మహిళ తమ కుటుంబ సభ్యులతో ఆటో ఎక్కి హనుమకొండ పెట్రోల్ పంపు వద్ద దిగి వెళ్లినారు. ఆ మహిళ ఆటోలో తన బ్యాగు మరిచిపోయింది. గమనించిన కిరణ్ ఇంతెజార్‌గంజ్ పోలీసు స్టేషన్ కు వచ్చి ఎస్సై వెంకన్నకు బ్యాగ్ అందజేశాడు. బ్యాగ్‌లో చూస్తే మహిళకు సంబంధించిన సుమారు మూడు తులాల బంగారు ఆభరణాలు, మూడుజ తల చెవికమ్మలు, రూ.17,500నగదు ఉంది. బ్యాగ్ మరిచిపోయిన మహిళ సాయంత్రం వరకు పోలీసు స్టేషన్‌కు రాలేదు.ఈ ఆభరణాలు వారిని గుర్తిం చి వారికి అందజేస్తామని సీఐ మచ్చ శివకుమార్ తెలిపారు. ఈ సందర్భం గా ఆటో డ్రైవర్ నిజాయితిని ఎస్సైలు వెంకన్న, రాజులు అభినందించారు.



పూజలో పాల్గొన్న కమిటీ, భక్తులు

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు షురూ

ఖిలావరంగల్, ఆగస్టు 26: శ్రీ శివశక్తి వినాయక మందిరం వద్ద గణపతి, శివ లింగ నందీశ్వర సహిత పార్వతిదేవి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఖిలావరంగల్ పెట్రోల్‌పంపు వద్దఇటీవల నూత నంగా నిర్మించిన దేవాలయంలో గణపతి, శివలింగ, నందీశ్వర విగ్రహాల పునఃప్ర తిష్ఠ కార్యక్రమం సోమవారం ప్రారంభమయ్యాయి. బుధవారం వరకు పూజలు సాగనున్నాయి. ఉదయం మహాగణపతిపూజ, మాతృకాపూజలు, ద్వార పూజలు, యాగశాల ప్రవేశం, సాయంత్రం సర్వదేవతా అవాహన మూల మంత్ర యాగ మండప హవనం నిర్వహించారు. వేడుకల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షులు, కార్పొరేటర్ బైరబోయిన ఉమా-దామోదర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి చెన్నూరి దేవేందర్, కోశాధికారులు మంతిని చక్రధర్, గండి నాగరాజు, గంద్రాతి నవీన్, ఉపాధ్యక్షులు సిద్ధం రాము, అచ్చ వినోద్, సహా య కార్యదర్శులు నల్లకుంట రవిందర్, వడ్డేపల్లి భరత్, పులిచేరి శ్రీనివాస్, అపరా దపు సారంగపాణి, గజ్జెల శ్యాం, అనుమాన సారయ్య, నాగవెళ్ళి రాజన్‌బాబు, గై అనిల్, పొన్నం కుమారస్వామి పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవ కమిటీలకు పోలీసుల సూచనలు

వరంగల్ కల్చరల్, ఆగస్టు 26: నగరంలోని ఇంతెజార్‌గంజ్ పోలీసు స్టేషన్ పరిధిలో గణేష్ మండపాల ఏర్పాటుకు పోలీసుస్టేషన్‌లో తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని సీఐ మచ్చ శివకుమార్ ఒక ప్రకటనలో సూచించారు. మండపం వద్ద కనీసం ముగ్గురు వలంటీర్లు 24 గంటలు అందుబాటులో ఉండాలని, వలం టీర్ల పేర్లను మండపం వద్ద ఒక పుస్తకంలో నమోదు చేయాలని సూచించారు. గాలివానకు కూలిపోకుండా పందపాలు ఏర్పాటు చేయాలని, రెండు స్పీకర్ బాక్స్ లను మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. డీజేలకు అనుమతి లేదని, స్పీకర్ బాక్స్‌ల కోసం ఏసీపీ అనుమతి తప్పనిసరని పేర్కొన్నారు. భక్తి పాటలు మాత్ర మే పెట్టాలని, రాజకీయ ప్రసంగాలకు తావులేదన్నారు. ఏదైనా అత్యవసరం నిమి త్తం డయల్ 100కు లేదా స్థానిక పోలీసులను సంప్రదించాలని సూచించారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



కౌంటిల్యాస్ పాఠశాలలో రాధాకృష్ణుల వేషధారణలో ..



లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో..



కాశిబుగ్గలో చిన్నారి..



కివీ స్కూల్‌లో వేడుకలు..

వరంగల్ కల్చరల్, ఆగస్టు 26: కృష్ణాష్టమి వేడుకలు సోమవారం నగ రంలో ఘనంగా నిర్వహించారు. వరంగల్ పోతన రోడ్డులోని శ్రీమురలీకృ ష్ణ మందిరంలో కృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భగవద్గీత పద్యపఠన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. స్వామివారి కి 108రకాల నైవేద్యాలను సమర్పించారు. అలాగే సమూహికంగా విష్ణు సహస్ర పారాయణం, భగవద్గీత పఠనం చేశారు. ములుగురోడ్‌లోని ఇస్కాన్ మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు.

➢ మట్టెవాడ: శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా సోమవారం వరంగల్ స్టేషన్ రోడ్‌లోని కాశీవిశ్వేశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసం సోమవారం శ్రీకృష్ణాష్టమి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాశీ విశ్వేశ్వరస్వామిని శ్రీకృష్ణుని అ లంకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి.కిషన్‌రావు, మాజీ కార్పొరేటర్ పోల శార్వాణి, నాగలక్ష్మీ, సునీత, పావని, శ్రుతి, సరిత, దుర్గా, జ్ఞానేశ్వర్, శ్రీవైష్ణవి, శ్రీవల్లి పాల్గొన్నారు.

➢ కరీమాబాద్: కరీమాబాద్ ప్రాంతంలోని న్యూ కౌటిల్యాస్ సెయింట్ ఆమెన్ హై స్కూల్లో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. కరస్పాం డెంట్ కోడెం శ్రీధర్, ప్రధానోపాధ్యాయురాలు సబిత ఆధ్వర్యంలో నిర్వ హించిన వేడుకల్లో విద్యార్థుల వేషధారణలు అలరించాయి.

➢ శంభునిపేట: రంగశాయిపేటలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో శ్రీకృ ష్ణ అష్టమి వేడుకలను నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ వరంగల్ వారియర్స్ అధ్యక్షుడు శేర్ల అనిల్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈమేరకు వి ద్యార్థుల వేషధారణలు ఆలరించాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శేర్ల రజిని, ఉపాధ్యాయులు సాలేహా, సాయి కృష్ణ, పూర్ణిమ, ప్రవీణ్, కృష్ణవేణి, తులసి, తస్లీమా, పర్హాత్, రజిత, మానస పాల్గొన్నారు.





మురళీకృష్ణ మందిరంలో కృష్ణుడి అలంకరణలో కాశీవిశ్వేశ్వరుడు, 108 రకాల నైవేద్యం

➢ కరీమాబాద్: కరీమాబాద్‌లోని కివీ పాఠశా లలో ప్రధానోపాధ్యాయుడు దాసి సతీష్‌మూర్తి ఆధ్వర్యంలో సు మారు 300మంది విద్యార్థులు రాధాకృష్ణుల వేషధారణలో ఆకట్టుకు న్నారు. వేడుకల్లో వైస్ ప్రిన్సిపాల్ అన్నదేవర ప్రవీ ణ్‌కుమార్, డైరెక్టర్ దాసి రజిని తదితరులు పాల్గొన్నారు.

ఉట్ల పండుగకు సర్వం సిద్ధం

శంభునిపేట, ఆగస్టు 26 : కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా మంగ ళవారం రంగశాయిపేటలో నిర్వహించే ఉట్ల పండుగకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ముంబాయిలో జరిగే ఉట్ల పండుగలా ఇక్కడ నిర్వ హిస్తారు. కరోనా కారణంగా 2019 నుంచి వేడుకలు నిర్వహించ లేదు. నాలుగేళ్ల తర్వాత కురుమ కులస్థులు ఉత్సవాలకు రెడీ అయ్యారు. మండల మొగిళి 1984లో ఈ వేడుకలను ప్రారంభిం చారు. ఉత్సవాలను మహంకాళీ ఆలయ మైదానంలో నిర్వహించ టానికి ఏర్పాట్లను చేశారు. జినుక రమేష్ ఇంటి శ్రీకృష్ణుడిని డప్పు చప్పుళ్లతో మహంకాళీ మైదానానికి తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వ హిస్తారు. సుమారు 20ఫీట్ల ఎత్తులో ఉండే పోల్‌కు ఉట్టిని కడుతా రు. ప్రతీ జట్టులో 10 మంది ఉంటారు. నాలుగు అంతస్థులుగా ఎక్కితేనే ఉట్టిని కొట్టగలుగుతారు.

పలువురికి ఆహ్వానాలు.

ఉత్సవాలకు రావాలని మంత్రి కొండా సురేఖమురళీతోపాటు పలువురు నాయకులు, అధికారులను కలిసి ఆహ్వానాలు అందించా రు. కార్పొరేటర్ గుండు చందనపూర్ణచందర్, పీఏసీఎస్ చైర్మన్ కేడల పద్మజనార్దన్‌లతో పాటు ఉత్సవ సమితి బాధ్యులు మండల సీతారాములు, జినుక రమేష్, కంచె మల్లయ్య, చిగిరి పూర్ణచందర్, జినుక కుమార్‌ల ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులను కలిసి సహకరించాలని వినతి పత్రాలు అందించారు.

'పాలకుల అండతోనే భూ కబ్జాలు'

గిర్మాజిపేట, ఆగస్టు 26: పేదలకు చెందాల్సిన ప్రభుత్వ భూములు పాలకు ల అండతో కబ్జాలు చేస్తున్నారని బహుజన లెఫ్ట్ ఫ్రంట్ రాష్ట్ర చైర్మన్ నల్ల సూ ర్యప్రకాశరావు ఆరోపించారు. పోరాటాల ద్వారానే పేదలు భూముల హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. సోమవారం అండర్‌బ్రిడ్జి సమీపంలోని ఎం సీపీఐ(యు) జిల్లా కార్యాలయం ఓంకార్ భవన్‌లో బహుజన లెఫ్ట్‌ఫ్రంట్ వరం గల్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ నర్ర ప్రతాప్ ఆధ్యక్షతన జరిగిన పార్టీ ఉమ్మడి జిల్లా భూ సదస్సులో మాట్లాడుతూ నైజాం రజాకార్లకు వ్యతిరేకంగా భూమి భుక్తి విముక్తి లక్ష్యంగా పోరాడి భూములను సాధించుకుంటే స్వరాష్ట్ర పాలన లో భూమి కోసం పోరాడాల్సిన దుస్థితి నెలకొనడం సిగ్గుచేటుగా ఉందన్నారు. ప్రభుత్వాలు సంక్షేమ పథకాల అమలు పేరుతో విద్య, వైద్యం, భూమి పేదలకు అందకుండా చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర కార్యదర్శి గాదగొని రవి మాట్లా డుతూ పాలకులు ఎప్పుడు దోపిడీదారులు,కబ్జాదారుల పక్షాన నిలుస్తారని ధ్వజమెత్తారు. సమావేశంలో పొలిట్‌బ్యూరో సభ్యులు వల్లేపు ఉపేందర్ రెడ్డి, కేంద్ర కమిటీ సభ్యులు గోనే కుమారస్వామి, వరంగల్, హనుమకొండ, ములు గు జిల్లాల కార్యదర్శులు పెద్దారపు రమేష్, హంసారెడ్డి, చంద్రయ్య, నాయకు లు సునీల్, రాగసుధ, నీల రవిందర్, కుసుంబ బాబురావు, సంధ్య, వెంకన్న, తెలంగాణ రైతు సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్, గడ్డం నాగార్జున, కొమురయ్య, జగదీశ్వర్, నగేష్ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సూర్యప్రకాశరావు

కట్టమల్లన్న ఆలయ అభివృద్ధికి కృషి: రేవూరి



ఆలయ భూములను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రేవూరి

గీసుగొండ, ఆగస్టు 26: గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ కీర్తినగర్ సమీపం లోని కట్టమల్లన్న ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. సోమవారం ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పురాతన కట్టడాలను రక్షించుకోవాల్సిన బాధ్యత అం దరిపై ఉందన్నారు. గ్రేటర్ పట్టణానికి అతిచేరువలో ఉన్న ఆలయ అభివృద్ధి సరిగా లేదన్నారు. దేవాలయ భూములను రక్షించుకునేలా స్థానికులు సహ కరిస్తే తప్పకుండా ఆలయాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు కొండేటి కొమురారెడ్డి, దూపాకి సంతోష్, పార్టీ మండల అధ్యక్షు డు శ్రీనివాస్, గోదాసి చిన్న, ఎలగొండ ప్రవీణ్, బొడ్డు అనిల్, దాసారపు సారయ్య, పాష, నారాయణ పాల్గొన్నారు.

హిందూధర్మ పరిరక్షణకు పాటుపడాలి

నర్సంపేట, ఆగస్టు 26 : హిందూధర్మ పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరు పాటుపడాలని విశ్వహిందూపరిషత్ భజరంగ్‌దళ్ రాష్ట్ర సంయోజక్ శివరా ములు అన్నారు.పట్టణంలో హిందూసమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువులందరూ ఐకమత్యంతో ఉండి దేశాన్ని, హిందూ ధర్మాన్ని రక్షించుకోవాలన్నారు. కులమే దయినా మనమంతా హిందువులమే అని ఆయన అన్నారు. ప్రతీ గ్రామంలో ని హిందువులందరూ కలిసి విశ్వహిందూపరిషత్ కమిటీలను ఏర్పాటు చేసు కొని హిందూధర్మాన్ని కాపాడుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆర్ఎ స్ఎస్ సంఘచాలక్ మోతె సమ్మిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు కేశిరెడ్డి జైపాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ వనజ, మానుకోట జిల్లా అధ్యక్షుడుకృష్ణమోహన్, జిల్లా కార్యదర్శి వెలగందుల రాజు, జిల్లా సహాయకార్యదర్శి మల్యాల రవి, నర్సంపేట పట్టణ కార్యదర్శి వేల్పుల శ్రీధర్, బజరంగ్‌దళ్ కన్వీనర్ మేరుగుశో భన్‌కుమార్, కల్పన, రేణుక, కల్పన, భారతి, అరుణ పాల్గొన్నారు.

గంగదేవిపల్లిలో కేయూ విద్యార్థులు



గంగదేవిపల్లిని సందర్శించిన కేయూ విద్యార్థులు

గీసుగొండ, ఆగస్టు 26: మండలంలోని జాతీయ ఆదర్శ గ్రామం గంగదేవి పల్లిని కేయూ దూరవిద్య ద్వారా మాస్టర్ ఆఫ్ సోషల్‌వర్క్ చదువుతున్న 11 జిల్లాలకు చెందిన 46 మంది విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల బృందానికి జిల్లా ట్రేయినింగ్ మేనేజర్ కూసం రాజమౌళి గ్రామా భివృద్ధిలో ప్రజల స్వచ్ఛంద భాగస్వామ్యం, జాతీయ స్థాయికి ఎదిగిన విధా నం, సాధించిన ప్రగతి, లభించిన అవార్డుల గురించి వివరించారు. మాజీ సీఎం కేసీఆర్ గ్రామానికి వచ్చి రూ.10 కోట్లు మంజూరి చేయటం, మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ గ్రామ స్వచ్ఛతపై మాట్లాడటం జరిగిందన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



ఎగ్‌కార్ట్ సామగ్రిని లబ్ధిదారులకు అందజేస్తున్న ప్రదీప్‌రావు

మిల్స్‌కాలనీ, ఆగస్టు 26: అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ స్వ యం ఉపాధి పొందాలని నెక్ జోనల్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. సోమవారం ఓసిటీలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నెక్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ఉచితంగా ఎగ్‌కార్టులను అందజేశారు. ప్రదీ ప్ రావు మాట్లాడుతూ నెక్ జాతీయ అధ్యక్షురాలు అనురాధ దేశాయ్ డ్రీమ్ ప్రాజెక్టు అయిన ఎగ్ కార్ట్ స్కీమ్ వరంగల్‌లోని నిరుద్యోగులు ఉపాధి కల్పిం చడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం సుమారు 50 మంది లబ్ధిదారు లకు ఎగ్‌కార్టులను అందజేశారు. కార్యక్రమంలో నెక్ వరంగల్ రీజియన్ ప్రెసిడెంట్ వి.రామారావు, జోనల్ కమిటీ సభ్యులు సుబ్రమణ్యం, బి.శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షుడు టి.శ్యాంసుందర్‌రావు పాల్గొన్నారు.

సైన్స్ సామాజిక పురోగతికి పునాది

నర్సంపేట టౌన్, ఆగస్టు 26: సైన్స్ సామాజిక పురోగతికి పునాది అని నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ కె. లక్ష్మారెడ్డి అన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా ఐదవ మహాసభ నర్సంపేట పట్టణంలో డాక్టర్ పెండెం భాస్కర్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన లక్ష్మా రెడ్డి మాట్లాడుతూ సమాజంలో శాస్త్రీయ దృక్పథం, శాస్త్ర ప్రచారం పెంపొందించడం కోసం జన వి జ్ఞాన వేదిక గత 36 సంవత్సరాలుగా కృషి చేస్తోందన్నారు. సైన్స్ పరిశోధన ఫలితాలను సామాన్య ప్రజల చెంతకు తీసుకెళ్లడానికి అనేక చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. సైన్స్ లేకుం డా జీవకోటి మనుగడ సాధ్యం కాదన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జగదీశ్వర్, వనప్రేమి గోకా రామ స్వామి, గుంటి రాంచందర్, ఎం.డి.ఆలీ, బి. రఘుపతి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ లక్ష్మారెడ్డి

చికిత్స పొందుతూ మహిళ మృతి

వరంగల్ చౌరస్తా, ఆగస్టు 26: ఆత్మహత్యాయ త్నానికి పాల్పడిన మహిళ చికిత్స పొందుతూ సోమ వారం మృతిచెందినట్లు ఇంతెజార్‌గంజ్ సీఐ వెల్లడిం చారు. ఆయన కథనం ప్రకారం. 28క్రితం కాశిబుగ్గకు చెందిన చేరాలుతో కాశిబుగ్గకు చెందిన రూసపల్లి విజయ(42)కు వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. ఆర్థిక ఇబ్బందులతో అప్పులు కావడంతో ఇంట్లో తర చూ గొడవలు జరిగేవి. భర్త పని చేయకపోవడంతో మనోవేదనతో ఈనెల19న భర్తతో గొడవపడి పురుగు ల మందు తాగింది. ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా, చికిత్సపొందుతూ సోమవారం మృతి చెందింది. మృ తురాలి అన్న చింతం కుమార్ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నారు.

కత్తితో బెదిరించిన వ్యక్తి అరెస్టు : ఏసీపీ



అరెస్టు చూపుతున్న పోలీసులు

మట్టెవాడ, ఆగస్టు 26: కత్తితో బెదిరించి రూ.10 వేలు అపహరించిన నిందితుడిని అరెస్టు చేసినట్లు వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ తెలిపారు. ఏసీపీ కథనం ప్రకారం. ఈనెల 24న రంగశాయిపేటకు చెందిన ఎండి.ఫారూక్ వరంగల్ కొత్తవాడ ఎస్సారె స్పీ కెనాల్ డీఎంహెచ్‌వో కార్యాలయం సమీపంలో ఓ వ్యక్తిని కత్తితో బెదిరించి, అతని వద్ద నుంచి రూ.పది వేల అపహరించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సోమవారం ఫారూక్‌ను అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ. వెయ్యి, కత్తిని స్వాధీన పర్చుకున్నారు. ఏసీపీ మాట్లాడుతూ అమాయక ప్రజలను బెదించినా, దాడులకు, నేరాలకు పాల్పడి నా ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించా రు. ప్రతిభకనబర్చిన మట్టెవాడ సీఐ గోపి, ఎస్ఐలు జి.సాంబయ్య, నవీన్‌ను ఏసీపీ అభినందించారు.

గుండెపోటుతో మాజీ కార్పొరేటర్ మృతి



శ్రీనివాస్(ఫైల్)

ఆటోనగర్, ఆగస్టు 26: గ్రేటర్ వరంగల్ 23వ డివిజన్ కొత్తవాడ కు చెందిన మాజీ కార్పొరేటర్ యెలుగం శ్రీనివాస్(54) ఆది వారంరాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. శ్రీనివాస్ ఆది వారం రాత్రి భోజనం చేసి, నిద్ర పోయే ముందు ఛాతిలో నొప్పి రావడంతో హంటర్‌రోడ్డులోని ఓ ప్రైవేటు హస్పిటల్‌కు తరలించగా కాసేపటికే గుండె పోటుతో మృతిచెందాడు. శ్రీనివాస్ 2005-10 సంవత్సరం వరకు కాంగ్రెస్ కార్పొరేటర్‌గా పని చేశారు. 2013లో బీఆర్ఎస్‌లో చేరి 'కుడా' డైరెక్టర్‌గా కొనసాగారు. ప్రస్తుతం బీఆర్ఎస్ జిల్లా నాయకు డిగా కొనసాగుతున్నారు. శ్రీనివాస్ మృతదేహాన్ని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, బీజేపీ నాయకుడు, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, కార్పొరే టర్లు బస్వరాజు కుమారస్వామి, బస్వరాజు శ్రీమాన్, మహమ్మద్ ఫుర్ఖాన్, మాజీ కార్పొరేటర్లు దామెర సర్వేశ్, యెలుగం లీలావతి-సత్యనారాయణ, మసూ ద్, టీపీసీసీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు, మండల శంకర్, గొండ శ్రీనివాస్‌లు సందర్శించి నివాళులర్పించారు.



28న ఎరువులు, విత్తనాల షాపుల బంద్

నర్సంపేట,ఆగస్టు 26 : రాష్ట్ర ప్రభుత్వం గత రెండు నెలలుగా ప్రభుత్వం ప్రైవేటు వ్యాపారులకు ఎరువులను సరఫరా చేయకపోవడాన్ని నిరసిస్తూ ఈనెల 28న నర్సంపేట పట్టణంలోని ఎరువులు, విత్తనాల షాపులను బంద్ చేయనున్నట్లు ఎరువులు, విత్తన షాపుల అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి తెలిపారు. యూరియా కోసం రైతులు షాపులకు వస్తున్నారని కానీ, స్టాక్ లేనందున వారికి అవసరమైన యూరియాను తాము అందించలేక పోతున్నామన్నారు. కంపెనీలకు ప్రభుత్వం అనుమతి ఇవ్వని కారణంగా వారు ప్రయివేటు వ్యాపారులకు యూరియా సరఫరా చేయడం లేదన్నారు. వెంటనే ప్రైవేటు వ్యాపారులకు యూరియా సరఫరా చేయాలని ఆయన కోరారు. జిల్లా అసోసియేషన్ పిలుపు మేరకు జిల్లా వ్యాప్త కార్యక్రమంలో భాగంగా నర్సంపేట డివిజన్‌లో, పట్టణంలోని ఎరువులు, షీడ్స్ షాపులను బుధవారం బంద్ చేస్తున్నట్లు తెలిపారు.


ఆలయ భూములను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రేవూరి

కట్టమల్లన్న ఆలయ అభివృద్ధికి కృషి

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి

గీసుగొండ, ఆగస్టు 26: గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ కీర్తినగర్ సమీపంలోని కట్టమల్లన్న ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పురాతన కట్టడాలను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గ్రేటర్ పట్టణానికి అతిచేరువలో ఉన్న ఆలయ అభివృద్ధి సరిగా లేదన్నారు. దేవాలయ భూములను రక్షించుకునేలా స్థానికులు సహకరిస్తే తప్పకుండా ఆలయాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు కొండేటి కొమురారెడ్డి, దూపాకి సంతోష్, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, గోదాసి చిన్న, ఎలగొండ ప్రవీణ్, బొడ్డు అనిల్, దాసారపు సారయ్య, పాష, నారాయణ పాల్గొన్నారు.

గంగదేవిపల్లిని సందర్శించిన కేయూ విద్యార్థులు



గంగదేవిపల్లిని సందర్శించిన కేయూ విద్యార్థులు

గీసుగొండ, ఆగస్టు 26: మండలంలోని జాతీయ ఆదర్శ గ్రామం గంగదేవిపల్లిని కేయూ దూరవిద్య ద్వారా మాస్టర్ ఆఫ్ సోషల్‌వర్క్ చదువుతున్న 11 జిల్లాలకు చెందిన 46 మంది విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల బృందానికి జిల్లా ట్రేయినింగ్ మేనేజర్ కూసం రాజమౌళి గ్రామాభివృద్ధిలో ప్రజల స్వచ్ఛంద భాగస్వామ్యం, జాతీయ స్థాయికి ఎదిగిన విధానం, సాధించిన ప్రగతి, లభించిన అవార్డుల గురించి వివరించారు. మాజీ సీఎం కేసీఆర్ గ్రామానికి వచ్చి రూ.10 కోట్లు మంజూరి చేయటం, మన్‌కీబాత్‌లో ప్రధాని మోదీ గ్రామస్వచ్ఛతపై మాట్లాడటం జరిగిందన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

వర్ధన్నపేట, ఆగస్టు 26: శ్రీ కృష్ణుడు అంటేనే ధర్మానికి నిర్వచనమని, ప్రతీ ఒక్కరు ఆయన సూచనలతో ధర్మ పాలనకై ముందుకు సాగాలని తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు అన్నారు. సోమవారం పట్టణంలో నిర్వహించిన శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొడ్రాయి వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని, ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కృష్ణుడు ధర్మ బోధనకై భగవద్గీతలో ప్రజలకు తన సందేశాన్ని అందించాడని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపాలిటీ వైస్ చైర్మన్ కోమాండ్ల ఎలేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు తోటకూరి రాజమణి, సమ్మెట సుధీర్, మంచాల రామకృష్ణ, యాదవ సంఘం అధ్యక్షుడు సిలివేరు కుమారస్వామి, నర్సయ్య, బక్కతట్ల రాజు, నారాయణరెడ్డి, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

● నర్సంపేట: పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలోని విజ్‌డమ్ పాఠశాలలో డైరెక్టర్ జావెద్, కరస్పాండెంట్ జహంగీర్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో చిన్నారులు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. గీతాంజలి పాఠశాలలో ప్రిన్సిపాల్ గూడూరు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో పూర్ణచందర్, రాజు, మహేశ్, అజయ్, వీరన్న, రాధ, అప్సరాబేగం, శ్రీలత, లత, చందన, రజిత తదితరులు పాల్గొన్నారు. మదర్స్‌లాండ్ పాఠశాల చైర్మన్ పాశికంటి రమేశ్ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● వర్ధన్నపేట: కృష్ణాష్టమి వేడుకలు వర్ధన్నపేట మున్సిపాలిటీని ఆల్ఫోర్స్ ఈ టెక్నో పాఠశాలలో నిర్వహించారు. ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వీ.నరేందర్‌రెడ్డి హాజరై జ్యోతిప్రజ్వలన చేసి శ్రీకృష్ణుడి విగ్రహానికి పూజలు నిర్వహించి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా 150 మంది విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, శ్రీకృష్ణుడి జన్మవృత్తాంతం ఎంతగానో ఆలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● చెన్నారావుపేట: మండల కేంద్రంలోని సిద్దార్థ గురుకుహై స్కూల్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దార్థ విద్యా సంస్థల చైర్మన్ కంది గోపాల్‌రెడ్డి శ్రీ కృష్ణుడి చిత్ర పటానికి పూలమాల వేసి, ప్రత్యేక పూజలను నిర్వహించి విద్యార్థులతో కలిసి ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అండెం కర్ణాకర్‌రెడ్డి, జక్కుల జగదీశ్వర్, మేడి రమేష్‌గౌడ్, కొండపర్తి కృష్ణామోహన్ దివ్యజ్యోతి, వేణు, గణేష్‌గీత, విష్ణు, పైనాల రాజు, ఆరే రాజు, పొన్నం రమేష్, శ్రీనువాస్, కవిత, సృజన. కుండె రోజా పాల్గొన్నారు.

●దుగ్గొండి: మండల కేంద్రంలోని గిర్నిబావిలోని న్యూ విజన్ స్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కృష్ణ డు, గోపిక, రాధ వేషదారణలో అలరించారు. కోలాటాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నరసింహారెడ్డి, ప్రిన్సిపాల్ మహిపాల్‌రెడ్డి, డైరెక్టర్ మోతె రాజు, పాల్గొన్నారు.

●నెక్కొండ: మండలంలోని శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయంలో, స్థానిక గౌతమి పాఠశాలల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయంలో గోమాతకు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు బీవీఎస్ శాస్త్రీ, జ్యోతిష పండితుడు శ్రావన్ కుమార్, రామలింగేశ్వర సేవాసమి సభ్యులు పాల్గొన్నారు.

●వర్ధన్నపేట రూరల్: మండలంలోని ఆయా గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవ సంఘాల ఆధ్వర్యంలో కృష్ణునికి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని ఇల్లందలో ఓ ప్రైవేటు పాఠశాలలో విద్యార్థులు కృష్ణుడు, గోపికమ్మల వేషధారణలో అందరినీ అలరించారు. ఉట్టి కొట్టే కార్యక్రమం చేసి ఉత్సాహంగా గడిపారు.

● గీసుగొండ: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను మండలంలో నిర్వహించారు. చిన్నారుల శ్రీకృష్ణ వేషధారణలు అలరించారు. గ్రామ కూడళ్ల వద్ద ఉట్టికొట్టే వేడుకలో యువకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

●సంగెం: మండలంలోని కృష్ణాష్టమి సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల శ్రీకృష్ణ, గొల్లభామల వేషధారణలు ఆకట్టుకున్నాయి. రాంచంద్రాపురంలోని కాకతీయ ఉన్నత పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బొంపెల్లి దిలీప్‌రావు, మాజీ సర్పంచ్ జయశ్రీలు విద్యార్థుల చేత వేయించిన వేషధారణలు ఆకట్టుకున్నాయి. లోహిత వేడుకలు ఘనంగా జరిగాయి.


వర్ధన్నపేటలో ఉట్టి కొడుతున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు


నెక్కొండ గౌతమి హై స్కూల్‌లో వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు




గోపికల వేషధారణలో చెన్నారావుపేట సిద్దార్థ చిన్నారులు

సైన్స్ సామాజిక పురోగతికి పునాది

నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ లక్ష్మారెడ్డి

నర్సంపేట టౌన్, ఆగస్టు 26: సైన్స్ సామాజిక పురోగతికి పునాది అని నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ కె. లక్ష్మారెడ్డి అన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా ఐదవ మహాసభ నర్సంపేట పట్టణంలో డాక్టర్ పెండెం భాస్కర్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన లక్ష్మారెడ్డి మాట్లాడుతూ సమాజంలో శాస్త్రీయ దృక్పథం, శాస్త్ర ప్రచారం పెంపొందించడం కోసం జన విజ్ఞాన వేదిక గత 36 సంవత్సరాలుగా కృషి చేస్తోందన్నారు. సైన్స్ పరిశోధన ఫలితాలను సామాన్య ప్రజల చెంతకు తీసుకెళ్లడానికి అనేక చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. సైన్స్ లేకుండా జీవకోటి మనుగడ సాధ్యం కాదన్నారు. రాతియుగం నుంచి రాకెట్ యుగంలోకి పరిణామం చెందినటువంటి నేటి సమాజం అనేక మూఢనమ్మకాల బారినపడి తిరోగమనం వైపు ప్రయాణిస్తుండడం విచారకరమన్నారు. నేటి విజ్ఞాన ప్రపంచంలో నివసిస్తున్న మేధావులు, యువకులు, మహిళలు, విద్యార్థులు సమిష్టిగా కృషి చేసి ప్రజలను మూఢనమ్మకాల నుంచి విముక్తులను చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం మూఢనమ్మకాల మీద నిషేధ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జగదీశ్వర్, వనప్రేమి గోకా రామస్వామి, గుంటి రాంచందర్, ఎం.డి.అలీ, బి. రఘుపతి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ లక్ష్మారెడ్డి

సీనియర్ జర్నలిస్టు తిరుపతిరెడ్డికి నివాళి


నర్సంపేటలో తిరుపతిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జర్నలిస్టులు

నర్సంపేట, ఆగస్టు 26: నర్సంపేటకు చెందిన సీనియర్ జర్నలిస్టు సిరిపురం తిరుపతిరెడ్డికి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ప్రింట్, అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు సోమవారం పట్టణంలోని అమర వీరుల స్థూపం వద్ద తిరుపతిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు గొడిశాల సదానందం, బుర్రవేణు, ముంతోజుకిరణ్, ఆగారపు స్వామి, మహదేవుని జగదీశ్, కందుల శ్రీనివాస్, రాగం నరేందర్, పిట్టల కుమారస్వామి, మోహన్, నరేశ్, రమేశ్, శోభన్, ఇబ్రహిం, అఖిల్, సాయి, శ్రీకాంత్, రాజేందర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఐని కలిసిన కాంగ్రెస్ నాయకులు

వర్ధన్నపేట, ఆగస్టు 26: వర్ధన్నపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన కె.శ్రీనివాస్‌రావును సోమవారం కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్య సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. సీఐని కలిసిన వారిలో కాంగ్రెస్ నాయకులు బండారి సతీష్, నాంపెల్లి రవీందర్, తీగల సునీతగౌడ్, కొండేటి మధుకర్, కందిక ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ ఆలయంలో చోరీ

వర్ధన్నపేట, ఆగస్టు 26 : వర్ధన్నపేట పట్టణ శివారులోని దుర్గమ్మ ఆలయంలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. సోమవారం ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వర్ధన్నపేట పట్టణ శివారు కోనారెడ్డి చెరువు మత్తడి వద్ద వడ్డెరల కులదైవం అయిన దుర్గమాత ఆలయంలో హుండీలోని సుమారు రూ.5వేల చిల్లర నగదు చోరీకి గురైంది. కుల పెద్ద శివరాత్రి రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కాంగ్రెస్ నుంచి ఇద్దరి బహిష్కరణ

ఖానాపురం, ఆగస్టు 26: మండలంలోని మంగళవారిపేటలో కాంగ్రెస్ పార్టీ నుంచి ఇద్దరిని బహిష్కరించినట్లు గ్రామ పార్టీ అధ్యక్షుడు బొమ్మగాని నవీన్ తెలిపారు. సోమవారం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డ మేకల లింగయ్య, బానోతు పంతులును పార్టీ నుంచి బహిష్కరించినట్లు తెలిపారు. ఇక మీదట వారికి పార్టీతో ఎలాంటి సంబంధం లేదని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మూడు పూల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల నియామకం

చెన్నారావుపేట, ఆగస్టు 26: మండలంలో ఖాళీగా ఉన్న గ్రామ పంచాయితీలకు ఇన్‌చార్జి కార్యదర్శులను నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాల జారీ చేసినట్లు ఎంపీడీవో శ్రీవాణి సోమవారం తెలిపారు. చెన్నారావుపేట గ్రామ పంచాయతీ కార్యదర్శిగా కే రంజిత్‌కుమార్, కాల్‌నాయక్‌తండా కార్యదర్శిగా జ్యోతి, కందిగడ్డ తండా కార్యదర్శిగా శ్యామ్ ప్రసాద్, కోనాపురం కార్యదర్శిగా ఆర్ రాజుకుమార్‌లను ఇన్‌చార్జి కార్యదర్శులుగా నియామకం చేస్తూ ఉత్తర్వులను అందజేయడం జరిగిందన్నారు.

హిందూధర్మ పరిరక్షణ కోసం పాటుపడాలి

భజరంగ్‌దళ్ రాష్ట్ర సంయోజక్ శివరాములు


మాట్లాడుతున్న భజరంగ్‌దళ్ రాష్ట్ర సంయోజక్ శివరాములు

నర్సంపేట, ఆగస్టు 26 : హిందూధర్మ పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరు పాటుపడాలని విశ్వహిందూపరిషత్ భజరంగ్‌దళ్ రాష్ట్ర సంయోజక్ శివరాములు అన్నారు. పట్టణంలో హిందూసమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువులందరూ ఐకమత్యంతో ఉండి దేశాన్ని, హిందూ ధర్మాన్ని రక్షించుకోవాలని అన్నారు. కులమేదయినా మనమంతా హిందువులమే అని ఆయన అన్నారు. ప్రతీ గ్రామంలోని హిందువులందరూ కలిసి విశ్వహిందూపరిషత్ కమిటీలను ఏర్పాటు చేసుకొని హిందూధర్మాన్ని కాపాడుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ సంఘచాలక్ మోతె సమ్మిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు కేశిరెడ్డి జైపాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ వనజ, మానుకోట జిల్లా అధ్యక్షుడుకృష్ణమోహన్, జిల్లా కార్యదర్శి వెలగందుల రాజు, జిల్లా సహాయకార్యదర్శి మల్యాల రవి, నర్సంపేట పట్టణ కార్యదర్శి వేల్పుల శ్రీధర్, బజరంగ్‌దళ్ కన్వీనర్ మేరుగుశోభన్‌కుమార్, కల్పన, రేణుక, కల్పన, భారతి, అరుణ పాల్గొన్నారు.

లీడ్ లైబ్రరీని సందర్శించిన ఆంధ్ర సాహితీవేత్తలు

నర్సంపేట టౌన్, ఆగస్టు 26: నర్సంపేట పట్టణంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు, రచయిత, కవి కాసుల రవికుమార్, శోభారాణి దంపతులు తమ స్వంత ఖర్చులతో నిర్వహిస్తున్న లీడ్ గ్రంథాలయ సందర్శనకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా ఒంగోలు నుంచి జానుడి లిటరరీ సంస్థ డైరెక్టర్లు, ప్రముఖ సాహితీవేత్తలు డాక్టర్ నూకతోటి రవికుమార్, మల్లవరపు ప్రభాకర్ రావు, అజయ్, రెడ్డప్పలు సోమవారం వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒంగోలు కేంద్రంగా జానుడి లిటరరీ సెంటర్‌ను నిర్వహిస్తున్నామని, అక్కడి నుంచి 400 కిలోమీటర్ల దూరం వరకు కొనసాగించిన లిటరరీ జర్నీ ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు.

లీడ్ గ్రంథాలయం నుంచి తాము ఎంతో స్ఫూర్తిని పొందామన్నారు. కాసుల రవికుమార్ తన సొంత ఇంటిని పిల్లల కోసం, పుస్తకాల కోసం కేటాయించి నిస్వార్థంగా చేయడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో జానుడి, లీడ్ లైబ్రరీ సంయుక్తంగా రెండు రాష్ట్రాల్లో విభిన్నమైన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.



లీడ్ లైబ్రరీ సందర్శనకు వచ్చిన సాహితీవేత్తలు

రోడ్డు భద్రత ప్రమాణాలు పాటించాలి

వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య

వర్ధన్నపేట రూరల్, ఆగస్టు 26: ప్రతీ ఒక్కరు రోడ్డు భద్రత ప్రమాణాలు పాటించాలని వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య అన్నారు. సోమవారం మండలంలోని ఇల్లంద గ్రామంలో రోడ్డు భద్రతపై స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తగా వీలేజ్ రోడ్ సేఫ్టీ కమిటీని ఏర్పాటు చేసుకుని ప్రతీ ఒక్కరు ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డును క్రాస్ చేసే సమయంలో సైతం జాగ్రలు పాటించాలని, కారు నడిపేటడప్పుడు సేఫ్టీ బెల్టు పెట్టుకోవాలని తెలిపారు. వాహనాలకు సైతం సంబంధిత పత్రాలు ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఇల్లందలో స్థానికులతో మాట్లాడుతున్న ఏసీపీ అంబటి నర్సయ్య

యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలి

చెన్నారావుపేట, ఆగస్టు 26:యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ బరిలో ఉన్న బండి హరీష్‌ను గెలిపించాలని కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు చింతల కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని లింగగిరిలో యూత్ సభ్యులందరికీ ఐవైసీ ద్వారా మెంబర్ షిప్‌ను ఇవ్వటం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే మాధవరెడ్డి బలపరిచిన హరీష్‌ను గెలిపించుకోవాలన్నారు. 35 ఏళ్ల లోపు ఉన్న వారందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఆన్‌లైన్ ఓటింగ్ విధానం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, నెక్కొండ బ్లాక్ కార్యదర్శి మంద యాకయ్యగౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దెన రమేష్, రూపిక శ్రవణ్ భాస్కర్,పాల్గొన్నారు.


జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఎన్నిక

నర్సంపేట టౌన్, ఆగస్టు 26 : జన విజ్ఞాన వేదిక జిల్లా నూతన కమిటీని సోమవారం నర్సంపేట పట్టణంలో జరిగిన వేదిక ఐదవ జిల్లా మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా మోతె ఇంద్రసేనారెడ్డి, గుగులోతు సుధాకర్, కోశాధికారిగా ఎం. అశోక్, గౌరవ అధ్యక్షుడిగా డాక్టర్ వి. ఎం.జయుడు, పెండెం భాస్కర్‌లు ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా పాచికంటి రమేష్, పి.కుమార్‌రెడ్డి, బి. శ్రావణ్‌కుమార్, ఎ. సుధాకర్‌రెడ్డి, వి. మాధవి, ఎస్. జ్యోతి, కార్యదర్శులుగా ఇంద్రారెడ్డి, దుర్గాచారి, నర్సింహ, శ్యాంసుందర్, ఎ.రాజులతో పాటు సబ్ కమిటీ కన్వీనర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

చెన్నారావుపేట, ఆగస్టు 26: మండలంలోని లింగాపురం గ్రామానికి చెందిన పసునూటి భాగ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు రూ. 5వేలను ఆర్థిక సాయంగా అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు మంచిక కుమారస్వామి, మండల నాయకులు మాజీ స ర్పంచ్ తప్పెట రమేష్, స్వామి, చంద్రమౌళి, యాకయ్య, ఐలయ్య, బాబు, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ మండల కమిటీ ఎన్నిక


నియామకపత్రం అందుకుంటున్న కార్యవర్గ సభ్యులు

నల్లబెల్లి, ఆగస్టు 26 : జాతీయ మానవ హక్కుల కమిటీ మండల నూతన కమిటీ ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు గోరపూడి భాస్కర్, జిల్లా అధ్యక్షుడు నల్ల రవికిరణ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో సోమవారం ఎన్‌హెచ్ ఆర్సీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న భాస్కర్, రవికిరణ్ మాట్లాడుతూ ప్రజలు తమ హక్కులు, విధుల పట్ల తప్పనిసరిగా అవగాహ కలిగి ఉండాలని పేర్కొన్నారు. అనంతరం నూతన కమిటీ ఎన్నుకున్నారు.

అధ్యక్షుడిగా మండలంలోని పంతులపల్లి గ్రామానికి చెందిన ఆవునూరి కిషోర్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు వారు తెలిపారు. మండల ప్రధాన కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన గుమ్మడి వేణు, ఉపాధ్యక్షుడిగా సాయికుమార్, కార్యవర్గ సభ్యులుగా హరీష్, ఎండి.యాకుబ్‌పాష, ఉప్పుల శ్రీధర్, సాయికుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ అధ్యక్షులు ఎ.చిరంజీవి, జిల్లా ప్రధాన కార్యదర్శి సంఘం రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు నెహ్రూనాయక్, ఎన్నికల కన్వీనర్ కొమ్మల శ్రీనివాస్, అధికార ప్రతినిధి జరుపుల ప్రవీణ్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.